
# ...రించబడి నుండి గుజరాత్ దాకా




...ంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం

ఎ. పి. సి. ఎల్. సి. ప్రచురణ :
ఆగస్టు 1985

## ము ం దు మా ట

జూలై 17 నాడు కారంచేడులో జరిగిన మారణకాండ దేశాన్నంతా కలచివేసింది. 38 సంవత్సరాల స్వాతంత్ర్యం తరువాత దేశంలో బలహీన వర్గాల పరిస్థితి ఏమిటన్న ప్రశ్న లేవదీసింది.

ఈ హత్యాకాండను కొందరు కులం తగాదాగాను, కొందరు తెలుగుదేశం దుశ్చర్యగాను, మరికొందరు మరొకవిధంగాను వ్యాఖ్యానిస్తున్నారు. ఇదేదో కాకతాళీయంగా జరిగిన సంఘటన, దీన్ని మరీ ఎక్కువ చేయక 'శాంతించాలని' ఇంకొందరి అభిప్రాయం.

ఇన్ని రకాల దురభిప్రాయాలుండబట్టే ఈ పుస్తకం అవసరమయింది. కారంచేడు కాకతాళీయమయిన సంఘటనా కాదు, కులం తగాదా కాదు, కేవలం తెలుగుదేశానికి ప్రత్యేకమయిన దుశ్చర్యా కాదు. అది మన దేశ వర్తమాన రాజకీయార్థిక అభివృద్ధికి సహజ పరిణామం. ఈ పరిణామాన్ని కారంచేడులోనే కాదు, గుజరాత్ తదితర రాష్ట్రాలలో చెలరేగుతున్న రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలలో గూడ చూడవచ్చు. ఈ విషయాన్ని, ఈ సంబంధాన్ని వివరించే ప్రయత్నం ఈ చిన్న పుస్తకం.

వెల : 0-50 పై.

B-G

# కారంచేడునుండి గుజరాత్ దాకా...

కారంచేడును కేవలం ఒకానొక ప్రత్యేకమయిన సంఘటనగానో, ఒకానొక కులంవాళ్ళు హరిజనుల మీద చేసిన దాడిగానో చూడడం పొరబాటవుతుంది. కారంచేడుకు కొన్ని ప్రత్యేకమయిన లక్షణాలున్న మాట వాస్తవమే. జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి అనే జమీందార్ ప్రభావం వల్ల 1947కు పూర్వం ఆ గ్రామం లోని కమ్మ కులస్తులయిన మోతుబరులలో జస్టిస్‌పార్టీ అనుకూలత, కాంగ్రెస్ వ్యతిరేకత వున్నది. 1947 తరువాత జస్టిస్‌పార్టీ అస్తిత్వాన్ని కోల్పోయి కాంగ్రెస్ అధికారానికి రాబట్టి అందరూ కాకున్నా చాలామంది కాంగ్రెస్‌వైపు మళ్ళారు. అయితే 1983 లో తెలుగుదేశం ఏర్పడ్డాక మళ్ళీ మొత్తం అందరూ తెలుగు దేశంవైపు మొగ్గారు. పైగా కమ్మ కులస్తులు గ్రామంలో సంఖ్యరీత్యా చాలా ఎక్కువ కావడం గూడ ఈ మోతుబరులకు బలాన్ని ఇచ్చింది. వాళ్ళు కులంపేరు మీద తమ కులస్తులలోని మధ్య తరగతి మద్దతును సమీకరించుకోగలిగారు. మొత్తం కులాన్నంతా ఒక్క త్రాటిమీద నిలబెట్టగలిగారు. అయితే ఈ ప్రత్యేక లక్షణాలే కారంచేడు మారణకాండకు కారణమని అనుకుంటే పొరబాటవుతుంది. ఒక పోకడ సమాజంలో మొలకెత్తితే దానికి అనుకూలమయిన వాతావరణం దొరికినప్పుడు అది బలంగా ముందుకొస్తుంది. అంతమాత్రంచేత అలా వాతావరణం అనుకూలంగా వుండడమే ఆ పోకడకు కారణమని అనుకోకూడదు.

అందుకే కారంచేడును అర్థం చేసుకోవడానికి మనం మన సమాజంలో తలెత్తు తున్న పోకడలను క్లుప్తంగానయినా పరిశీలించాలి. దానికి నేపథ్యంగా ఒకసారి చరిత్రను పునరావలోకనం చేసుకోవాలి.

మనదేశంలో కులవ్యవస్థ చరిత్ర చెప్పాలంటే భూమి సంబంధాల చరిత్ర చెప్పాలి. మేమిక్కడ అంతటి సాహసం చేయడం లేదుగాని మాలమాదిగల ప్రస్తుత స్థితిని అర్థం చేసుకోవడానికి అవసరమయిన మౌలికమయిన విషయాలను తెలుసు కోవాలి.

భూమి మీద స్వంత యాజమాన్యం ఏర్పడి, వ్యవసాయ ప్రధానమయిన వర్గ సమాజం పుట్టినప్పటినుండి, భూస్వాముల కమతాలలో శ్రమ ఎవ్వరిచేత చేయించాలి, ఎట్లా చేయించాలి, వాళ్ల చేసిన శ్రమలో అత్యధిక భాగాన్ని పాలకవర్గం ఎట్లా

చేజిక్కించుకోవాలి, అనేవి ప్రధానమయిన సమస్యలగా వుంటాయి. ఆధునిక పారిశ్రామిక సమాజాలకు పూర్వం ఈ సమస్యలే అన్ని దేశాల చరిత్రనూ నడిపాయి. ఒక్కొక్క దేశం ఈ సమస్యను ఒక్కొక్క రకంగా పరిష్కరించింది. ఆ పరిష్కారాన్ని బట్టి కమతాలలో శ్రమచేసే శ్రామికులకు రకరకాల పేర్లు వచ్చాయి, బానిస, అర్ధబానిస (serf), వ్యవసాయకూలీ, పాలేరు, జీతగాడు, రైతు, కౌలుదారు, ఇంకా ఎన్నో ఈ పేర్లు.

వీళ్ళచేత పని చేయించుకోవడానికి, దోపిడీకి లోబరచుకోవడానికి, ఆయా దేశాలలో ఎన్నో పద్ధతులు ప్రవేశపెట్టారు. కొన్నిచోట్ల వీళ్ళను బానిసలు చేసి యజమానులకు కట్టిపడేసారు. కొన్నిచోట్ల అర్ధబానిసలు చేసి భూమికి కట్టిపడేసారు. యజమానినిగాని, భూమిని గాని విడిచిపెట్టిపోతే అది చట్టరీత్యా నేరం అన్నారు. మన దేశంలో గూడ ఈ రెండూ ప్రయత్నించారు. అయితే వీటికంటె గూడ ప్రధానమయిన ప్రయత్నం వర్ణవ్యవస్థ, కులవ్యవస్థల రూపంలో జరిగింది. కొంతమందికి జన్మతః భూమిగాని ఇతర ఆస్తిగాని కలిగివుండే అర్హత లేదని, కలవాళ్ళ పొలాలలో కష్టం చేయడమే వీళ్ళ 'ధర్మం' అనీ సాంఘికంగా కట్టుదిట్టం చేసే ప్రయత్నం చేసారు.

మొదట్లో వీళ్ళను 'శూద్రులు' అన్నారు. ఈ 'శూద్రులు' అన్న మాటను బ్రాహ్మణ శాస్త్రకారులు వ్యవసాయ శ్రామిక వర్గానికే కాక, తమ వైదికమతాన్ని అంగీకరించని వారికందరికీ (ఉదాహరణకు విదేశీయులయిన గ్రీకులు, కుషానులు, అన్యమతస్తులయిన బౌద్ధులు, జైనులు) ప్రయోగించడంవల్ల ఆ శాస్త్రకారులను అర్ధం చేసుకోవడంలో కొంత ఇబ్బంది వుందిగాని, మౌలికంగా శూద్రులు అంటే ఆస్తిలేని శ్రామికులే.

ఋగ్వేదంలోని పురుషసూక్తంలో, ఆదిపురుషుడి ముఖంనుండి బ్రాహ్మణులు, భుజాలనుండి క్షత్రియులు, తొడలనుండి వైశ్యులు, పాదాలనుండి శూద్రులు పుట్టారని అన్నారు. అగ్రవర్ణాల వారికి సేవ చేయడమే శూద్రుల ధర్మం అని బ్రాహ్మణ శాస్త్రకారులంతా అన్నారు. స్వధర్మాన్ని ఆచరించక పోవడం మహాపాపం అని భగవద్గీతలో కృష్ణుడు ఒక్కసారి కాదు, పదే పదే అన్నాడు. చివరికి, 'స్వధర్మంవల్ల మరణమే సంభవించినా ఫరవాలేదు, పరధర్మానికి ఆశపడడం కన్న అదే నయం' అన్నాడు. శూద్రులు ఒకరి సేవకులని, వాళ్ళను ఇష్టానుసారం హింసించవచ్చుననీ ఐతరేయ బ్రాహ్మణంలో అన్నారు. ఆపస్తంబుడి నుండి మనువుదాక, మనువునుండి బృహస్పతి

దాక, 1000 ఏళ్ళపాటు శాస్త్రకారులంతా ఈ నియమాలను నొక్కి చెప్పడమే కాక, కూలిచేసే ధర్మాన్ని శూద్రులు అతిక్రమిస్తే ఎన్ని రకాలుగా శిక్షించవచ్చునో రూల్సు తయారుచేశారు. కూలికి సరిగ్గా పోకపోతే భౌతికంగా దండించవచ్చునన్నారు. పని మధ్యలో మానేస్తే చేసిన పనికి గూడ వేతనం ఇయ్యనవసరం లేదన్నారు. తిరగబడితే చేతులూ కాళ్లూ నరకమన్నారు. యజమానికి వ్యతిరేకంగా ఫిర్యాదు చేసుకోవడానికి సహితం వీలులేదని కౌటిల్యుడు అన్నాడు.

ఇంత చేసినప్పటికీ శూద్రులు పూర్తిగా భూమిహీనులుగా వుండిపోలేదు. వాళ్ళలో చాలామంది ఎంతో కొంత భూమి సంపాదించుకోవడం మొదలు పెట్టారు. మన దేశంలో వ్యవసాయ యోగ్యమయిన బీడు భూమి విస్తృతంగా వున్న కారణంగా వాళ్ళను కేవలం సేవక ధర్మానికే కట్టుబడి వుండేలాగ చేయడం సాధ్యం కాలేదు. ఇవ్వాళ మనకు బంజర్లు తప్ప వేరే బీడు భూములు దొరకవుగాని క్రీ. శ. 1800 దాకా గూడ సారవంతమయిన బీళ్లు దేశంలో చాలా వుండేవి.

ఈ విధంగా ఒక ప్రక్క శూద్రులు 'కంట్రోల్' లో లేకుండ పోతుంటే వేరొకప్రక్క వ్యవసాయంలో అభివృద్ధి పెరిగి కూలివాళ్ళ అవసరం ఎక్కువయింది. క్రమంగా, అంతకాలం హైందవ సమాజానికి వెలుపల, ఆహార సేకరణ మీదనో వేటమీదనో ఆధారపడి జీవించిన ఆటవికులు కొందరు గ్రామాలలోకి ప్రవేశించి వ్యవసాయ కూలీలుగా స్థిరపడ్డారు. వీళ్ళను హైందవ భూస్వామ్య సమాజం శూద్రులకంటె నికృష్టంగా చూసింది. శూద్రులమీద గతంలో పెట్టిన ఆంక్షలకంటె తీవ్రమయిన ఆంక్షలు వీళ్ళమీద పెట్టింది. వీళ్ళే మాల, మాదిగ, మహార్, చమార్ తదితర పంచమ కులస్తులు. గాంధీ పరిభాషలో 'హరిజనులు'. వీళ్ళను అంటరాదని, చూడరాదని, వీళ్లు ఊరికి వెలుపలే ఉండాలని తీర్మానించింది. అయితే ఈ నిషేధాలన్నింటికీ మూలం ఒక్కటే: అది వీళ్ళను భూమినుండి వెలివేయడం. స్వంత భూమి కలిగివుండి స్వంత సేద్యం చేసుకునే అర్హతనుండి వీళ్ళను దూరం చేయడంద్వారా మన దేశ భూస్వామ్యవర్గం తన చెప్పుచేతలలో వుండే కూలివర్గాన్ని తయారు చేసుకుంది. భూమినుండి వీళ్ళను వెలివేసి సమాజం నుండి గూడ వీళ్ళను వెలివేసింది. అయితే ఆధునిక సంస్కర్తలంతా సమాజంనుండి వెలివేయడాన్నే ప్రధాన విషయంగా తీసుకొని సంస్కరించే ప్రయత్నం చేసారు. అందుకే వీళ్లు ఆ సంస్కరణలలో సహితం విజయం పొందలేదు.

కాలక్రమంలో మాలమాదిగలలో కొందరు కొంత భూమి, ఆస్తి, ఉద్యోగాలు, సంపాదించుకున్నప్పటికీ మౌలికంగా ఈ విషయంలో మార్పురాలేదు. వాళ్ల చాలా వరకు ఇప్పటికే భూమిలేని కూలీలుగా వుంటున్నారు. వాళ్ళతోబాటు కొన్ని గిరిజన తెగలకు చెందిన వాళ్ళు, కొందరు కాపు తదితర కులాలకు చెందిన వాళ్ళు కలిసి ఇవాళ్టి వ్యవసాయ కూలీ వర్గం ఏర్పడింది. ప్రాచీనకాలంలాగే ఇప్పటికే ఈ వర్గం అణచివేతకు గురవుతోంది. అప్పటిలాగే ఇప్పటికీ ఈ అణచివేతకు ఒక్కటే మూల కారణం. భూమి గలవాళ్ళకు తమ పొలాలలో చవకగా పనిచేసే కూలీలు కావాలి. అందుకే వ్యవసాయ కూలీలకు వేతనం పెంచడం అన్నా, మిగులు భూముల పంపక మన్నా, తమ హక్కులను డిమాండ్ చేసే చైతన్యం పెంపొందించడమన్నా, చివరికి చదువులలో ఉద్యోగాలలో రిజర్వేషన్లన్నా, భూమి గల వర్గాల నుండి ఇంత వ్యతిరేకత వస్తోంది. ఈ విషయంలో సాధారణ రైతులు సర్దుబాటు చేసు కోవడానికి సిద్ధమే గాని భూస్వాములు, మోతుబరులు, మాత్రం బద్ధ విరోధులుగా వున్నారు. కులం ప్రాతిపదిక మీద సాధారణ రైతులను గూడ తమ వెనుక సమీ కరించుకుంటున్నారు.

వర్తమాన చరిత్ర :-

1947 తరువాత భారత ప్రభుత్వం ప్రకటించిన అభివృద్ధి విధానంలో రెండు ముఖ్య అంశాలున్నాయి. ఒకటి సాంకేతిక అభివృద్ధి. అంటే భారీ పరిశ్రమలు నెల కొల్పడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకోవడం, బహుళార్థ ప్రాజెక్టులను నిర్మించడం, వ్యవసాయంలో ఉత్పత్తి పెరుగుదల కోసం రసాయనిక ఎరువులు మొదలయిన ఉపకరాలను దిగుమతి చేసుకోవడం (లేదా ఇక్కడే ఉత్పత్తి చేయించడం) మొదలయినవి. ఇవన్నీ గూడ మౌలికంగా ధనవంతులకు తోడ్పడే పథకాలే. ఈ విధంగా ధనికులను మరింత ధనికులు చేయడం ద్వారా అభివృద్ధిని సాధించాలనే ప్రయత్నం యిది. ఇందులో ప్రభుత్వం ఆశించిన ప్రగతిని సాధించ లేకపోయినప్పటికీ కొంత మేరకు సఫలం అయింది. ధనికులలో చాలామంది తమ ఆస్తులను రెండింతలు మూడింతలేకాదు వందరెట్లు గూడ పెంచుకున్నారు. దేశం ఎంత మేరకు అభివృద్ధి చెందిందన్నది వేరే సంగతి.

రెండవ అంశం సామాజిక సంక్షేమానికి సంబంధించినది. పేద వర్గాల అభ్యున్నతి కోసం, సంక్షేమం కోసం, ప్రభుత్వం వివిధ పథకాలనూ, విధానాలనూ ప్రకటించింది. శాసనాలు చేసింది. భూసంస్కరణలు, కౌలుదార్లకు రక్షణ, గిరిజనుల

భూములు అన్యాక్రాంతం కాకుండ శక్షణ, కనీసవేతన చట్టాలు, పౌరసత్వ హక్కుల చట్టం, సన్నకారు రైతుల అభివృద్ధి సంస్థలు, ఎస్.సి, బి.సి కార్పొరేషన్లు, గ్రామీణ ఉపాధి పథకాలు, గిరిజన అభివృద్ధి పథకాలు, ఇట్లా పేర్లు చెప్పుకుంటూ పోతే లెక్కలేనన్ని వున్నాయి. కాని వీటి అమలులో మాత్రం ప్రభుత్వం ఘోరంగా విఫలమయిందని అందరూ అంగీకరిస్తారు. దీనికి రుజువుగా ప్రతిపక్షాలనో లేక అలవాటుగా ప్రభుత్వాన్ని విమర్శించేవారినో వుటంకించాల్సిన పనిలేదు. ప్రభుత్వ సంస్థల రిపోర్టుల మాటలలోనే చెప్పవచ్చు. ఇక్కడ రెండు ఉదాహరణలు మాత్రం ఇస్తాము.

(అ) కట్టుబానిసత్వం (Bonded labour). దేశంలోని వ్యవసాయ శ్రామికులలో చాలాభాగం ఏదో ఒక మేరకు కట్టుబానిసత్వానికి గురయి వుంటారన్నది అందరికీ తెలిసిన విషయమే. దీన్ని రద్దుచేయడానికి ఎమర్జెన్సీలు Bonded labour Abolition Act వచ్చింది. దీనికింద కట్టుబానిసలగా గుర్తించబడింది, పునరావాసం పొందింది, ఎందరో చూడండి.

| రాష్ట్రం | గుర్తించిన కట్టుబానిసల సంఖ్య | పునరావాసం పొందినవారి సంఖ్య |
|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 13,422 | 8,620 |
| బీహార్ | 7,651 | 4,503 |
| గుజరాత్ | 63 | 62 |
| కేరళ | 829 | 452 |
| మధ్యప్రదేశ్ | 1,777 | 263 |
| ఉత్తరప్రదేశ్ | 8,644 | 4,584 |
| రాజస్థాన్ | 6,047 | 6,027 |
| మహారాష్ట్ర | 292 | 292 |
| ఒరిస్సా | 15,632 | 1,323 |
| తమిళనాడు | 27,874 | 26,964 |
| కర్నాటక | 62,699 | 31,189 |
| దేశం మొత్తం. | 1,44,930 | 84,269 |

(ఇవి 1982 లెక్కలు) అంటే దేశంలోని 6కోట్ల వ్యవసాయ శ్రామికులలో 1.45 లక్షలు (0.25 శాతం) మాత్రమే కట్టు బానిసలగా ఎంచబడగా, అందులో సగం మంది మాత్రమే పునరావాసం పొందారు. వీళ్ల పునరావాసంకోసం పెట్టిన

ఖర్చుగూడ ఎందరికీ సరిపోదు. చట్టంప్రకారం తలసరి 4000 రూపాయలు ఖర్చు పెట్టాలి. అది అరఎకరం మెట్టభూమి కొనుక్కోవడానికి గూడ సరిపోదు. అయితే చట్టమే అట్లావుండగా, పెట్టిన ఖర్చు (మనరాష్ట్రంలో) కేవలం తలసరి 1869 రూపాయలే. (ఐ.ఐ.పి.ఏ వారి సూచన ప్రకారం తలసరి కనీసం 20వేల రూపాయలయినా ఖర్చుపెట్టకపోతే వాళ్లు తిరిగి కట్టు బానిసత్వానికే పోతారు).

(ఆ) భూసంస్కరణలు : భూస్వాముల కమతాల మీద గరిష్ట పరిమితి (ceiling) విధించి మిగులు భూమిని వ్యవసాయ కూలీలకు పంచుతామన్నారు. 1960లలో ఒక విడత, 1972 తరువాత మరొక విడత, భూపరిమితి (Land–ceiling) చట్టాలు వచ్చాయి. ఈ చట్టాల అమలు ఎంత బాగావుందో ఈ గణాంకాల వల్ల తెలుసుకోవచ్చు :

| | |
|---|---|
| భారతదేశంలో మొత్తం వాడకానికి అందుబాట్లో వున్న భూమి | 75 కోట్ల ఎకరాలు |
| భూపరిమితి చట్టాలక్రింద పంచబడ్డ మిగులు భూమి (1976) | 12.6 లక్షల ఎకరాలు |
| మొత్తం భూమిలో ఇది— | 0.17 శాతం |
| భారతదేశంలో మొత్తం వ్యవసాయ శ్రామికుల జనాభా (1976 అంచనా) | 5 కోట్లు |
| మిగులు భూమిని పొందినవారి సంఖ్య | 10 లక్షలు |
| మొత్తం వ్యవసాయ శ్రామికులలో ఇది — | 2 శాతం |

అంటే, 100 ఎకరాలలో 0.17 ఎకరాన్ని (అనగా 7 కుంటలను) వ్యవసాయ శ్రామికులలో 2 శతానికి తలసరి ఒక్క ఎకరంకంటె కొంచెం ఎక్కువ పంచియిచ్చి, దీనితో భూమి కొరత తీరిందని నమ్మమంటున్నారు.

అన్ని సంక్షేమ పథకాల సంగతీ యిదే. అయితే విచిత్ర మయిన విషయం ఏమిటంటే ఈ రకంగా ఒకవైపు సంక్షేమ పథకాలన్నీ అమలులో విఫలమవుతూనే వున్నా, వేరొకవైపు ధనిక వర్గంలో వీటిపట్ల వ్యతిరేకత మాత్రం పెరుగుతూవుంది. ఎందుకంటే ఈ పథకాలవల్ల భౌతిక ప్రయోజనం ఉన్నాలేకపోయినా కూలిజనంలో చైతన్యం పెరుగుతుందని వీళ్లకోపం. అందుకే వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వం గూడ ఇదే కారణంగా కాబోలు ఈ మధ్యకాలంలో సామాజిక సంక్షేమం గురించికాని సంస్కరణల గురించికాని మాట్లాడడం మానేసింది.

సంక్షేమపథకాలపట్ల ధనికులలో గల వ్యతిరేకత ధనికులలో అన్నిటికంటె రిజర్వేషన్ల విషయంలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. బలహీన వర్గాలకు ఇచ్చిన రిజర్వేషన్లను వ్యతిరేకించే పోకడ దేశమంతటా తలెత్తుతోంది. కొన్నిచోట్ల ఆందోళనలు సహితం మొదలయ్యాయి. అయితే, రిజర్వేషన్లు మంచివా చెడ్డవా అన్న చర్చలోపడి, అసలు అవి ఎంత మేరకు అమలవుతున్నాయో ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. అమలుకు సంబంధించిన వివరాలను (మచ్చుకు ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, కేంద్ర సర్వీసులు) ఇక్కడ ఇస్తున్నాము.

## ఆంధ్రప్రదేశ్ (1974 గణాంకాలు)

| | | |
|---|---|---|
| రాష్ట్ర జనాభాలో హరిజనుల సంఖ్య | | 14.60 శాతం |
| ఉద్యోగాలలో హరిజనులకు రిజర్వేషన్లు | | 14.00 శాతం |
| రిజర్వేషన్ల అమలు : వివిధకేడర్లలో హరిజనుల సంఖ్య : | | |
| | క్లాస్ i | 5.5 శాతం |
| | క్లాస్ ii | 3.3 శాతం |
| | క్లాస్ iii | 5.5 శాతం |
| | క్లాస్ iv | 14.0 శాతం |

## ఉత్తరప్రదేశ్ [1974 గణాంకాలు]

| | | |
|---|---|---|
| రాష్ట్ర జనాభాలో హరిజనుల సంఖ్య | | 21.00 శాతం |
| ఉద్యోగాలలో హరిజనులకు రిజర్వేషన్లు | | 18.00 శాతం |
| రిజర్వేషన్ల అమలు : వివిధకేడర్లలో హరిజనుల సంఖ్య : | | |
| | క్లాస్ i | 3.1 శాతం |
| | క్లాస్ ii | 3.6 శాతం |
| | క్లాస్ iii | 8.0 శాతం |
| | క్లాస్ iv | 12.8 శాతం |

## కేంద్ర సర్వీసులు (1975 గణాంకాలు)

| | | |
|---|---|---|
| దేశజనాభాలో హరిజనుల సంఖ్య | | 14.00 శాతం |
| ఉద్యోగాలలో హరిజనులకు రిజర్వేషన్లు | | 14.00 శాతం |
| రిజర్వేషన్ల అమలు: వివిధ కేడర్లలో హరిజనుల సంఖ్య | | |
| | క్లాస్ I | 1.44 శాతం |
| | క్లాస్ II | 3.02 శాతం |
| | క్లాస్ III | 13.73 శాతం |
| | క్లాస్ IV | 26.29 శాతం |

అగ్రవర్ణాలలో చాలామంది పేదవాళ్లున్నమాట వాస్తవమే. వాళ్ళకు ప్రభుత్వం చేయూతనివ్వాలని అందరూ ఒప్పుకుంటారు. ఎస్.సి, ఎస్.టి, బి.సి వర్గాల కిచ్చే రిజర్వేషన్లుకాక ఆర్థిక ప్రాతిపదిక మీద అగ్రవర్ణాలకు చెందిన పేదవాళ్ళకు గూడ రిజర్వేషన్లివ్వాలంటే ఎవ్వరూ కాదనరు. కాని ఈ రిజర్వేషన్-వ్యతిరేక ఆందోళనలను నడుపుతున్నది, వాటికి నాయకత్వం వహిస్తున్నది, అగ్రవర్ణాలకు చెందిన పేదవాళ్ళు కాదు. అగ్రవర్ణాలకు చెందిన ధనికులు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల మోతుబరుల కుటుంబాలకు, పట్టణ ప్రాంతాల వ్యాపారస్తుల, ఉన్నత ఉద్యోగస్తుల, కుటుంబాలకు చెందినవారు, నడుపుతున్నారు. ఈ ఉద్యమాలు ఒక న్యాయమైన కోర్కెను సాధించడానికి సాగుతున్నవి కావు. పేదవాడి మీద దేశ వ్యాపితంగా జరుగుతున్న దాడులలో భాగంగా నడుస్తున్న అప్రజాస్వామికమయిన ఆందోళనలు. అందుకే ఇవి కుల మతకలహాల రూపం తీసుకొని గృహదహనాలకూ దళితుల మారణకాండకూ దారితీస్తున్నాయి.

## గుజరాత్

ఈ మధ్యనే నడిచిన గుజరాత్ రిజర్వేషన్-వ్యతిరేక ఆందోళనను పరిశీలిద్దాం.

ఈ ఆందోళనకు నాంది గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న ఒక నిర్ణయంలో వుంది. మార్చి నెలలో జరగబోయే ఎన్నికలను దృష్టిలో వుంచుకొని ఫిబ్రవరి నెలలో గుజరాత్ ప్రభుత్వం వెనుకబడ్డ తరగతుల (బి.సి) రిజర్వేషన్ కోటా 10 శాతం నుండి 28 శాతానికి పెంచింది. ఈ పెంపుదల రాణె కమిషన్ సూచించినదే. అయితే ఆ కమిషన్ 'వెనుకబడ్డ తరగతుల'ను గుర్తించడానికి, కులం ప్రాతిపదికను కాక ఆర్థిక ప్రాతిపదికను ఉపయోగించాలని అభిప్రాయ పడింది. సోలంకీ ప్రభుత్వం దీనిని పక్కనబెట్టి కులం ప్రాతిపదిక మీదనే నిర్ణయించింది.

ఫిబ్రవరి నెలలోనే ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా అలజడి ప్రారంభమయింది. అయితే ఎన్నికలు గడిచేదాకా అది బలం పుంజుకోలేదు. మార్చి మొదటి వారంలో ఎన్నికలు అయిపోయి, సోలంకీ ప్రభుత్వం పదవీస్వీకారం చేయగానే మళ్ళీ మొదలయింది. ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ టిక్కెట్టు పొందడంలో విఫలురయిన కాంగ్రెస్ నాయకుల హస్తం ఇందులో స్పష్టంగా కనిపించింది. బి.జె.పి. నాయకులయితే ఆందోళనలో స్వయంగా పాల్గొన్నారు. పైకి వీళ్ళందరూ రిజర్వేషన్లను సమర్ధిస్తూ మాట్లాడేవాళ్ళే. ఆందోళన క్రమంగా బలపడి మార్చి 18 నాడు అహమ్మదాబాద్ బంద్ విజయవంతంగా ముగిసింది. ఆందోళనకారులు ప్రధానంగా విద్యార్థులు. వాళ్ళ సంస్థ నవరచనా సమితి కాగా వాళ్ళ తలిదండ్రులయిన హోదా గల పెద్ద మనుష్యులు వాలీమహామండల్ అనే పేరిట సమీకృత మయ్యారు.

బంద్ విజయవంతంగా ముగిసిన మార్చి 18 రాత్రే అహమ్మదాబాద్‌లో మత కలహాలు ప్రారంభమయ్యాయి. ఎవరు ప్రారంభించారు, ఎందుకు ప్రారంభించారు, అనేవి ఇప్పటికీ తేలని విషయాలు. 'రిజర్వేషన్—వ్యతిరేక ఆందోళన' ఏ విధంగా నయితే సోలంకికి వ్యతిరేకమయిన వ్యక్తుల రాజకీయ స్వప్రయోజనాల కోసం బలం పుంజుకుందో అదే విధంగా ఆ ఆందోళనను ఆపించడం కోసం సోలంకియే తన అనుయాయులయిన హిందూ-ముస్లిం దొంగసారా వ్యాపారస్తులను వాడుకొని 'మత కలహం' సృష్టించాడన్న పుకారు అవాస్తవం కాకపోవచ్చు. ఈ మతకలహాల బెదురుకు ఆందోళనకారులుకూ తమ ఆందోళన విరమించుకున్నారు. మతకలహాలను ప్రేరేపించడంలో సోలంకీ ఆశించింది ఇదేఅయితే అది దక్కింది. కాని సోలంకి అంతటితో ఆగక ఆందోళనకారుల నాయకులను అరెస్టు చేసి (మతకలహాలు ప్రేరేపించారన్న ఆరోపణ మీద) జైలులో పెట్టాడు. దానితో ఏప్రిల్ నెలలో ఆందోళన మళ్ళీ మొదలయింది. తమ నాయకులను వదిలి పెట్టాలన్న డిమాండుతో విద్యార్థులు ఆందోళన మళ్ళీ మొదలుపెట్టారు. ఈసారి ప్రభుత్వం వాళ్ళమీదికి పోలీసులను దించింది. వెంటనే పత్రికలన్నీ పెద్ద ఎత్తున పోలీసు అత్యాచారాల గురించి రాయడం మొదలుపెట్టాయి. గుజరాత్ హైకోర్టులో పోలీసులకు వ్యతిరేకంగా ఆందోళనకారులు పిటిషన్లు వేసారు. హైకోర్టుగూడ ఒక అసాధారణమయిన తీర్పులో ఇద్దరు (బి.సి. కులాలకు చెందిన) పోలీస్ అధికార్లు ఫలాన ప్రాంతానికి పోవడానికి వీలులేని 'ఇంజంక్షన్' జారీచేసింది. అడిగిందే తడవుగా బి. జె. పి స్థావరమైన ఖాడియా ప్రాంతంలో జరిగిన పోలీసు అత్యాచారాల మీద న్యాయవిచారణకు ఆదేశం యిచ్చింది.

ఏప్రిల్ 20 నాటికి అల్లర్లు తీవ్రతరమయ్యాయి. విస్తృతంగా బలహీన వర్గాల మీద, ముస్లింల మీద, దాడులు జరిగి హత్యాకాండ కొనసాగింది. చివరికి న్యాయ విచారణ జరుగుతున్న ఖాడియా ప్రాంతంలో ఒక కానిస్టేబిల్‌ను ఎవరో చంపేసరికి పోలీసులు 'తిరగబడి' (ప్రభుత్వం మీద కాదు, ప్రజలమీద) గుజరాత్ సమాచార్ పత్రిక కార్యాలయాన్ని దగ్ధం చేయడం, దుకాణాలను లూటీ చేయడం, మొదలయిన పనులు చేయసాగారు. ఇక అప్పటినుండి అల్లర్లు (ఎక్కువగా కులమతసంఘర్షణలు-ఇంకా స్పష్టంగా చెప్పాలంటే హరిజనులమీద ముస్లింల మీద దాడులు) ఎడతెరిపి లేకుండ కొనసాగి 200 పైగా ప్రాణాలు పోయి సోలంకీ రాజీనామా చేసి రిజర్వేషన్‌ల పెంపుదలను వాయిదా వేయడానికి ప్రభుత్వం ఒప్పుకొన్న తరువాత కొంతకాలానికి చల్లారింది. ప్రస్తుతం ఆందోళన 'విరమించబడింది'.

గుజరాత్ ఆందోళన గురించి ఇంత వివరంగా చెప్పడానికి గల కారణమేమంటే ఇందులో గమనించదగ్గ అంశాలు కొన్ని వున్నాయి.

i) ఆందోళన మొత్తం సంకుచితమయిన రాజకీయ ప్రయోజనాలతో ముడిపడి నడిచింది. ఒక వైపు సోలంకీ అధికారకాంక్ష, మరొక వైపు అతన్ని గద్దెదించాలన్న అతని ప్రత్యర్థుల కాంక్ష, ఆందోళనలో బలమయిన ప్రోద్బలాలుగా పనిచేశాయి.

ii) పైకి రిజర్వేషన్లను సమర్థిస్తూమాట్లాడే భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ (ఐ), తదితర పార్టీల నాయకులు ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ ఆందోళనకు నాయకత్వం వహించారు.

iii) మామూలుగా విద్యార్థులు ఏ ప్రజాస్వామిక ఉద్యమంలోకి వెళ్ళినా వెనక్కి లాగే తలిదండ్రులు ఈ సారి తాముగూడ ఒక సంఘం పెట్టుకొని ఆందోళన లోకి దిగారు.

iv) ఆందోళనను నడిపింది ధనవంతుల బిడ్డలు కాబట్టి హైకోర్టు వాళ్ళ పిటిషన్లను అపూర్వమయిన వేగంతో పరిశీలించి పోలీసు అత్యాచారాలు మీద అపూర్వ మయిన తీర్పు ఇచ్చింది. పత్రికలు ఆందోళనకు అనుకూలంగా పెద్ద ఎత్తున గోల 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' అయితే సోలంకీని గద్దెదించేదాకా తానుగూడ ఆందోళనలో ఒక శక్తి అయి పనిచేసింది.

v) ఆందోళనను ఆసరాచేసుకొని హరిజనులమీద, ముస్లింల మీద, ప్రాణాంతకమయిన దాడులు జరిగాయి. అత్యధికంగా ప్రాణాలుకోల్పోయింది వీళ్ళే.

ఒక్క మాటలో చెప్పాలంటే గుజరాత్‌లోని ధనిక వర్గమంతా ఉమ్మడిగా బలహీనవర్గాలకు వ్యతిరేకంగా నడిపిన ఆందోళన యిది. అగ్రవర్ణాలకు చెందిన పేద వాళ్ళను గురించి కార్చిన కన్నీళ్లు కేవలం సాకు మాత్రమే. అందుకే ఈ ఆందోళనను గ్రామీణ ప్రాంతాలలో కూలిజనం మీద జరుగుతున్న దాడులకు అనుబంధ విషయంగా చూడక తప్పదు.

## ముగింపు

మనదేశంలో బలహీనవర్గాలమీద జరుగుతున్న అత్యాచారాలు, మనదేశపాల కులు అవలంభించిన ప్రగతి పథంతో ముడిపడి ఉన్నాయి. తరతరాల సామాజిక సంబంధాలలో ఎటువంటిమార్పు తేకుండ, దేశాన్ని కేవలం సాంకేతికంగా అభివృద్ధి చేసే విధానాన్ని అవలంభించిన కారణంగా, సాంప్రదాయకంగా పెత్తనం చేస్తున్న భూస్వామ్యవర్గాల పెత్తనం చెక్కుచెదరకుండ వాళ్ల ఆస్తులు మాత్రం విపరీతంగా పెరిగాయి. వ్యాపారాలూ ఉద్యోగాలూ గూడ వాళ్ళవే అయ్యాయి. రాజకీయ అధి కారమూ వాళ్ళదే అయింది. దీనితో వాళ్ళ అహంకారం గూడ విపరీతంగా పెరిగిపోయి పేదవర్గాల మీద దాడులు చేయడానికి, వాళ్ళవోట్ల కోసం కల్పించిన 'సంక్షేమ' పథకా లను సహితం నిరసించడానికి, దారితీసింది. ఇది నానారకాల అల్లర్లకూ దాడులకూ ఆందోళనలకూ దారితీస్తోంది.

కొంత చారిత్రక కారణాలవల్ల, కొంత రాజకీయ కారణాలవల్ల, ఈ దాడులు కులం తగాదాలగానూ కులం ప్రాతిపదిక మీద చేసిన దాడులుగాను కన బడతాయి గాని, ఇక్కడ కులం ప్రధానం కాదు. ఏ ప్రాంతంలో దాడిచేసిన వారయినా ఆ ప్రాంతంలో భూమీ పెత్తనం అధికంగా గల కులాలకు చెందినవారేగాని ఇతర అగ్రవర్ణాలకు చెందినవారు కాదు. కారంచేడులో కమ్మకులస్తులయితే రంగా రెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలలో తరచు హరిజనులపైన జరిగే అత్యా చారాలకు బాధ్యులు రెడ్లు, బీహార్‌లో భూమిహార్‌లు, ఉత్తర ప్రదేశ్‌లో ఠాకూర్‌లు, గుజరాత్‌లో పటేళ్లు. వీళ్ళంతాగూడ ఆయా ప్రాంతాలలో పెద్ద ఎత్తున భూమి గలవాళ్ళే. కులం ప్రసక్తి ఎక్కడ వస్తుందంటే, ఒక కులానికి చెందిన భూస్వాములు తమ తోటి కులస్తులయిన మధ్యవర్గాలను గూడ కొంతమేరకు తమ వెంట కులం పేరిట సమీకరించుకోగలుగుతున్నారు. అదేవిధంగా, దాడికి గురయినవి

గూడ కేవలం బలహీన కులాలు కాదు, ఎవరయితే ఈ పెత్తనానికి ఎదురుతిరిగి నిల బడ్డారో వాళ్లు గురయ్యారు, అవుతున్నారు.

ఈ దాడులకు కులాలన్నీ ఒకటే అయినట్టు పాలక పార్టీలన్నీ గూడ ఒకటే. రాస్వాల్‌కు తెలుగుదేశం నిజనిర్ధారణ కమిటీ, కారంచేడుకు కాంగ్రెస్ (ఐ) నిజ నిర్ధారణ కమిటీలు వెళ్ళడంలోనే ఈ అసహ్యకరమయిన వాస్తవం బహిర్గతమవు తోంది. ఈ పార్టీలన్నీ గూడ బలవంతుల తోటివే కాబట్టి ఒకచోట నేరం ఒకరి దయితే వేరొకచోట నేరం ఇంకొకరిదవుతుంది. తమది అయినచోట కప్పిపుచ్చి తమది కానిచోట శోకావేశపు హాహాకారాలతో దళితులను ముంచెత్తుతున్నారు.

ఇటువంటి పరిస్థితులలో ప్రజల కర్తవ్యం స్పష్టమే. ఈ దాడులకు మూల కారణమయిన దేశ ఆర్థిక అభివృద్ధి పథాన్ని సమసమాజం దిశగా మార్చే ప్రయత్నం చేపట్టాలి. అదొక్కటే కారంచేడులను, గుజరాత్‌లను ఆపగలదు. ఈ ప్రయత్నంలో పేదవాళ్ళందరి అవసరం (కులం ఏదయినా) ఒక్కటే: ఐక్యంగా వుండి, ధనిక వర్గాలకు కాక తమకు ప్రయోజనకరంగా వుండే ఆర్థిక వ్యవస్థను నిర్మించుకోవడం.

# అనుబంధం

# కారంచేడు హత్యాకాండ రిపోర్టు

ముందుగా వేసుకున్న పథకం ప్రకారం జూలై 17 ఉదయం కారంచేడు భూస్వాముల పాశవికదాడిలో ఆరుమంది హరిజనులు గొడ్డళ్ళతో, బరిసెలతో నరికి చంపబడ్డారు, ముగ్గురు స్త్రీలు మానభంగం లైంగిక అత్యాచారాలకు గురయ్యారు; ఎంతోమంది తీవ్రమైన గాయాలతో ఇంకా హాస్పిటల్‌లో ఉన్నారు. మాదిగపల్లిలోని ఇళ్ళు ధ్వంసం చేయబడ్డాయి.హరిజనులందరూ నిరాశ్రయులై ప్రాణాలు అరచేతి బట్టుకుని చీరాలలో తలదాచుకుంటున్నారు. పదిరికుప్పం, బండారుపల్లి, వెంకటకృష్ణాపురం ఫక్కీలో జరిగిన ఈ ఘటన జనతా హయాంలో బెల్చి మారణకాండను (1978) మరపించేదిగా ఉంది. కోటికి పడగలెత్తిన భూస్వాములు, రాష్ట్రరాజకీయ నాయకులు (ముఖ్యమంత్రి బంధువర్గం), సినిమా ప్రొడ్యూసర్లు, పరిశ్రమాధిపతులకు నిలయమైన కారంచేడు గ్రామం ప్రకాశంజిల్లా చీరాల తాలుకాలోనిది. నగరాలను మరపించే భవంతులతో నిండిన ఈ గ్రామం ఆంధ్రలో ఎంతో అభివృద్ధిచెందిన గ్రామంగా చెప్పుకుంటారు. అయితే ఇంత "అభివృద్ధి" చెందిన గ్రామంలో వ్యవసాయ కూలీలపరిస్థితి మధ్యయుగాలను గుర్తుకు తెస్తుంది. పాలేరుకు సంవత్సర జీతం రెండువేల రూపాయలు మాత్రమే. నాట్లు వేసే కాలంలో స్త్రీలకు 6 నుంచి 8 రూపాయలు, పురుషులకు 10 నుండి 12 రూపాయలకును మించి ఉండదు. ఈ కూలిరేట్లు పరిసర గ్రామాలకంటె తక్కువ కావడమేకాక, అభివృద్ధి చెందిన ప్రాంతానికి (Zone I) వర్తించే కనీస వేతనాలకంటె గూడ తక్కువ.

వేతనాలు మాత్రమేకాక మొత్తం పని పరిస్థితులు మధ్యయుగాలను తలపించేటట్లున్నాయి. పొలాన్ని పాలికి (Crop–Share) తీసుకునే రైతు రెండు రకాల ఏర్పాట్లలో ఒకటి ఎంచుకోవాలి. ఒక ఏర్పాటులో ఖర్చులన్నీ రైతే పెట్టుకొని పంటలో సగం భూస్వామికి ఇవ్వాలి. లెక్కవేసి చూస్తే ఈ ఏర్పాటులో రైతుకు తినడానికి గూడ సరిగ్గా మిగలదు. మరొక ఏర్పాటులో భూస్వామి ఎరువులు మందులు ఖర్చుపెట్టుకొని కొంత మొత్తం అడ్వాన్స్ ఇస్తాడు. పంటలో మూడింట రెండు వంతులు అతనికి ఇవ్వాలి. అయితే ఈ ఏర్పాటును అంగీకరించే రైతు భూస్వామి యింట్లోను భూస్వామి పొలంలోను వెట్టిచాకిరీ చేయాలి. ఈచాకిరీ ఉదయం 4-30 గంటలకు భూస్వామి ఇంటిదగ్గర మొదలవుతుంది. ఉదయం గుడిలో గంటమోగేసరికి (దీనిని "హరేరామ గంట" అంటారట) భూస్వామి యింట్లో వుండాలి. అప్పటినుండి రాత్రి 10 గంటల దాకా (అంటే

చూస్తే కారంచేడు సంఘటనలో ఎటువంటి వైపరీత్యం లేదు. 1983 నుండి కూడ (పదిరికుప్పం హత్యాకాండతో మొదలుపెట్టి) తెలుగుదేశం మద్దతు దార్లయిన భూస్వాములు తమ రాజకీయ ప్రత్యర్థులను గృహదహనానికీ మారణకాండకూ గురి చేస్తూనే వున్నారు.

## జూలై 16-17 సంఘటనలు

జూలై 16 సాయంత్రం హరిజనులు ఉపయోగించే మంచినీటి చెరువుదగ్గర శ్రీనివాసరావు, రాయనీడు ప్రసాద్ అనే ఇద్దరు కమ్మకులస్థులయిన యువకులకు, కత్తి చంద్రయ్య, మున్నంగి సువార్త అనే హరిజనులకు, తగాదా జరిగింది. గేదెకు పెడుతున్న కుడితినీళ్ళు చెరువులోకి పోతున్నాయని హరిజనులు అభ్యంతరం తెలిపారు. కమ్మయువకులు చంద్రయ్యనూ సువార్తనూ చంద్రకోలతో కొట్టారు.సువార్త ఆ చంద్రకోలను లాక్కొని తిరిగి ఒక దెబ్బవేసింది. ఆ రాత్రి కమ్మయువకులు కొందరు సువార్త యింటికి పోయి ఆమెను బయటకులాగే ప్రయత్నం చేసారు గాని, హరిజనులలో కొందరు పెద్దమనుషులు (పందిరి నాగేశ్వరరావు తదితరులు) సర్దిచెప్పగా వెళ్ళిపోయారు. అయితే సువార్త మామగారయిన మున్నంగి అంకయ్యతో పొద్దున్న వచ్చి తన కోడలి ప్రవర్తనకు సంజాయిషీ చెప్పుకోవాలని చెప్పి పోయారు.

మర్నాటి ఉదయం అంకయ్య తన యజమాని అయిన మండవ రాధాకృష్ణమూర్తి యింటికిపోయి, జరిగిన విషయాన్ని వివరించి, అందులో సంజాయిషీ చెప్పుకోవటానికి ఏమిలేదన్నాడు అదేసమయంలో పందిరి నాగేశ్వరరావు టీ తాగటానికి అగ్రవర్ణాలవారి ఇళ్ళదగ్గర ఒక దుకాణానికి పోయాడు. కమ్మకులస్తులయిన యువకులు కొందరు అతన్ని అక్కడే పట్టుకొని "వీడు తగాదాలు పరిష్కారం చేసేంత పెద్దమనిషి అయ్యాడు" అని కొట్టి, అక్కడినుండి రాధాకృష్ణమూర్తి ఇంటికిపోయి, అంకయ్యను బయటకు పంపియ్యమని అడిగారు. ఆయన అంకయ్యను కాపాడే ప్రయత్నం చేసాడుగాని, ఆయువకులు అతన్ని లాక్కుపోయారు. లాక్కుపోయి, కొట్టి, బందిరి దొడ్డిదగ్గర కూర్చోబెట్టి, మాదిగపల్లిమీదికి దాడికి బయలుదేరారు.

ఇక్కడ చెప్పవలసిన ముఖ్యవిషయం ఏమిటంటే, ఇదంతా యాదృచ్ఛికంగా జరిగింది కాదు. 16 నాటి రాత్రి ఈ యువకులు రాయినీడు ప్రసాద్‌కు చెందిన బ్రాందిషాపులో కూర్చొని పథకం వేసుకున్నట్టు స్పష్టమయిన ఆధారాలున్నాయి.

ఇక ఆ తరువాత జరిగినదాడిని వర్ణించడం కష్టం. వందలసంఖ్యలో (అంచనాలు 400 నుండి 3000 దాకా ఉన్నాయి) యువకులు కులంపేరిట బహిరంగంగా పిలుపు ఇచ్చుకొని సమీకృతమయి బరిసెలతోనూ గొడ్డళ్ళతోనూ మాదిగపల్లిని చుట్టుముట్టారు. ట్రాక్టర్లమీద, మోటార్ సైకిళ్ళమీద, వచ్చారు. చుట్టుముట్టి,

ఇళ్ళమీదపడి, దాడి మొదలుపెట్టారు. ఇళ్ళ మట్టిగోడలను తూట్లు పొడిచారు. ఫోటో లను పగలగొట్టారు. మనుషులను గొడ్డళ్ళతో నరికి బరిసెలతో పొడిచి చంపారు. తేళ్ళయేసు, దుడ్డు వందనం, అక్కడికక్కడే చనిపోయారు. లడ్డురమేశ్ 21 నాడు గుంటూరు ఆస్పత్రిలో చనిపోయాడు. దుడ్డుయేసు అతని గర్భవతి అయిన కోడలు కాపాడబోగా ఆమెను పక్కకుతోసి అతన్ని గొడ్డళ్ళతో నరికారు. అతను 22 నాడు గుంటూరు ఆస్పత్రిలో చనిపోయాడు.

ఇట్లాదాడి జరగగానే హరిజనులు భయభ్రాంతులయి పొలాలలోకి పారి పోయారు. 70 సంవత్సరాల తేళ్ళ మోషె, తేళ్ళ ముత్తయ్య, ఆ విధంగా పారిపోగా హంతకులు వాళ్ళను పొలాలలోకి తరిమి మహాక్రూరంగా చంపారు. గొడ్డలితో తల నరికి, వెల్లెలికిలా పడిపోగా, పొత్తికడుపులో బరిసెగుచ్చి తిప్పారు. ఈ విధంగా ఆరుగురు చనిపోగా మరొక ౨0 మందిదాకా గాయాలతో చీరాల గుంటూరు ఆస్పత్రులో చేరారు.

స్త్రీలనుగూడ ఈ హంతకులు విడిచిపెట్టిలేదు. వాళ్ళ బట్టలు చింపి వాళ్ళతో అసభ్యంగా ప్రవర్తించారు. ముగ్గురు అమ్మాయిలపైన (మరియమ్మ,విక్టోరియా, సులో చన) అత్యాచారం చేసి, పొత్తికడుపు కింద కర్రలతోపొడిచారు. వీళ్ళుగూడ ఆస్పత్రి పాలయ్యారు.

ఈ విధంగా ఒక గంటపైగా భీ భత్సం చేశారు. ఈ భీభత్సం జరుగుతుండ గానే పోలీసులు వచ్చారని, పోలీసుల సమక్షంలోనే కొందరిని హత్యచేశారినీ హరిజను లంటారు. నిజానికి గ్రామంలోని మాలవాడతో కొంతకాలం క్రితం జరిగిన ఘర్షణల ఫలితంగా ఒక రిద్దరు జవాన్లు గ్రామంలోనే వున్నారు. అయితే వీళ్ళు ఈ మారణ కాండను ఆపడానికి ఎటువంటి ప్రయత్నం చేసినట్లు కనిపించదు. ఆ నాడే కాదు జరిగిన వారంరోజుల దాకా జిల్లా పోలీసు యంత్రాంగం చాలా అలసత్వాన్ని ప్రదర్శించింది. శవాలకోసం వెతికేప్రయత్న చేయలేదు. (ఎందుకు చేయడంలేదంటే "శవాలు ఉంటే గద్దలూ రాబందులూ తిరుగుతుంటాయి, వెతకనక్కరలేదు" అని జిల్లా ఎస్. పి. గోఖలేగారు అంటారు). హంతకులు గ్రామంలో ఉన్నారేమో చూడడానికి ఇళ్ళు సోదా చేయలేదు. రైల్వేస్టేషన్ బస్స్టాండ్ల దగ్గర కాపలా పెట్టలేదు. ఈ హత్యా కాండ కుట్ర పూరితంగా జరిగింది కాబట్టి కుట్ర (సెక్షన్ 170 I P C) పెట్టవలసింది పెట్టలేదు. చివరికి, సంఘటన జరిగి వారం గడిచాక, దేశవ్యాపితంగా గొడవ మొద లయ్యాక, హంతకుల కోసం గాలింపు మొదలు పెట్టారు. ఇప్పటికి 65 మందిని అరెస్టుచేసినట్టు వినికిడి. కేసు ఎంతబాగా నడుపుతారో ఎంత న్యాయం జరుగుతుందో వేచి చూడవలసిందే.

చదవండి

# 'స్వేచ్ఛ'

ఎ.పి.సి.ఎల్.సి మాసపత్రిక

సంపాదకుడు :

## ఎం. కోదండరాంరెడ్డి

2-2-1144/11/3ఎ కొత్తనల్లకుంట, హైదరాబాద్-500 044

సంవత్సర చందా రూ॥ 10-00.

## ఎ.పి.సి.ఎల్.సి. ప్రచురణలు

| | |
|---|---|
| అన్నా వచ్చిండు.... | 1-00 రూ॥ |
| Repression on the Rural Poor in A.P. | 1-00 Rs. |
| NTR's one year | 1-00 Rs. |
| పటంచేరు కార్మికులు | 1-00 రూ॥ |
| పోలీసు కస్టడీలో మరణాలు, 1984 | 2-00 రూ॥ |
| Roll-call of the Dead Jail-June 1935 | 1-00 Rs. |
| పౌరహక్కుల ఉద్యమంపై పోలీసుల దాడి | 1-50 రూ॥ |
| ముఖ్యమంత్రికి బహిరంగలేఖ | ఉచితం |

# గల్పిక

"చిన్న పల్లిలో పదహారు మంది హరిజనులను భూస్వాముల గూండాలు—"

"పాపం !"

"పెద్దపర్రులో ఎనిమిది మంది హరిజన స్త్రీలను ముగ్గురు భూస్వాములు—"

"పాపం ! పాపం !"

"మధ్యకుంటలో నాలుగువందల హరిజన గుడిసెలకు నిప్పు పెట్టగా అయిదుగురు హరిజన వృద్ధులూ ఇరవై యిద్దరు హరిజన బాలబాలికలూ—"

"దారుణం ! దారుణం !"

"—భూస్వాముల మీద కొడవళ్ళతో తిరగబడి, ఇద్దరు భూస్వాములను చంపి, మరి ముగ్గురిని గాయపరిచి—"

"వాళ్ళందరికీ ఉరిశిక్షపడేట్లు చూస్తాం! దేన్నయినా సహిస్తాం గానీ అరాచకాన్ని—"

— కొడవటిగంటి కుటుంబరావు